సాక్షి
నంద్యాల
మంగళవారం, 4, ఏప్రిల్, 2023



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. వెయ్యి దీపాలు వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నదాన పథకానికి సోమవారం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన టి.రామకృష్ణదుర్గాప్రసాద్ రూ.లక్ష, కర్ణాటకకు చెందిన శంకరప్ప, యాదగిరి రూ.1.25లక్షలు విరాళమిచ్చారు.



డ్రైవర్ దొంగలా మారి!

బొమ్మలసత్రం: కారు డ్రైవర్ దొంగగా మారి యజమాని ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అవుకు మండలం రామాపురం గ్రామంలో ఈనెల 2న జరిగిన ఈ సంఘటనను పోలీసులు ఛేదించారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:47
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:50
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:50
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:44

హదీస్ వెలుగు :
రంజాన్ ఉపవాస దీక్ష పాటించే వారి పట్ల అల్లాహ్ అత్యంత కరుణ చూపుతారు. రోజా ఉన్న వారి కోసం సముద్రంలోని చేపలు సైతం దువా చేస్తాయి. - పవిత్ర ఖురాన్

పేదలకు 'ప్రైవేటు' విద్య

- ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు
- ప్రతి స్కూల్‌లో ఉచితంగా 25 శాతం సీట్లు
- రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు
- ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

పేద విద్యార్థుల కలలు సాకారమవుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకోవాలనుకునే వారి ఆశలను జగనన్న ప్రభుత్వం నెరవేరుస్తోంది. విద్యాహక్కు చట్టం–2009ను పకడ్బందీగా అమలు చేసి ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకే ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. సీట్ల కేటాయింపు, ప్రవేశాలు పారదర్శకంగా చేపట్టేందుకు ఇప్పటికే కసరత్తును ప్రారంభించింది.



నంద్యాల: ఆర్థిక సమస్యలతో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చదవలేకపోతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను పక్కాగా అమలు చేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతి నుంచి ఉచిత విద్యను అందించేందుకు 2022–23 విద్యాసంవత్సరం నుంచే శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్–12(1), (సీ)ని అనుసరించి 2023–24 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలో రూ.6,500 ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పాఠశాలలకు చెల్లిస్తుంది. అమ్మఒడి పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుంది. ప్రైవేటు స్కూళ్లకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బులతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును విద్యార్థి తల్లి, సంరక్షకుల ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలో 383 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలను గత ఏడాది నుంచి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఆలస్యంగా నోటిఫికేషన్ రావడంతో 70 మంది విద్యార్థులు ఉచిత విద్య కింద దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందారు. ఈ ఏడాది ముందుగానే నోటిఫికేషన్ వెలువడటంతో చాలా మంది పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా మారనుంది.

షెడ్యూల్ ఇలా..

- మార్చి 18 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభం కాగా ఏప్రిల్ 10వ తేదీ వరకు గడువు ఉంది.
- ఏప్రిల్ 12వ తేదీ విద్యార్థుల అర్హత నిర్ధారణ
- 13న లాటరీ ద్వారా మొదటి విడత జాబితా విడుదల
- 15 నుంచి 21వ తేదీ వరకు ఆయా పాఠశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు
- ఏప్రిల్ 25న లాటరీ ద్వారా రెండో విడత జాబితా విడుదల
- ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు రెండో విడత విద్యార్థులకు అడ్మిషన్లు

కిలో మీటర్ పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యత..

విద్యార్థులు నివాసం ఉండే (ఆధార్‌లో చిరునామా ప్రామాణికంగా) ప్రాంతంలో కిలో మీటరు పరిధిలో ఉన్న పాఠశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత 3కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు. ప్రతి ఒక్కరికి తమకు ఫలానా స్కూల్‌లో కావాలంటే వీలు పడదు. వారి ఇళ్లకు సమీపంలోని పాఠశాలలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల అడ్మిషన్లు పూర్తయితే ఎన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు పొందే వీలు ఉంటుందనేది అర్థమవుతుంది.

ఎంతో ప్రయోజనకరం



విద్యాహక్కు చట్టాన్ని ఆయా ప్రైవేటు పాఠశాలలు తప్పని సరిగా పాటించాలి. ఈ నిబంధనల అమలుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. ఏప్రిల్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రెండు విడతల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తాం.
- అనురాధ, డీఈఓ, నంద్యాల

పేద విద్యార్థులకు వరం



పేద విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకొనేందుకు వీలుగా ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించడం శుభపరిణామం. దీంతో పేద విద్యార్థులకు 25 శాతం పాఠశాలల్లో సీట్లు వస్తాయి. అందరికీ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం పేద విద్యార్థులకు వరం.
- తాటికొండ బుగ్గరాముడు, బుడగజంగాల రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల

సద్వినియోగం చేసుకోవాలి



విద్యా హక్కు చట్టం 2009 ద్వారా పేద పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా చదువుకునే అవకాశం కలిగింది. ఫీజు బెంగ ఉండదు. వారి చదువు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. 2023–24 విద్యాసంవత్సరంలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం.
- మేకల లింగస్వామి, మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, నంద్యాల

ట్రాన్స్‌కో ఏఈకి ఏసీబీ 'షాక్'



స్వాధీనం చేసుకున్న నగదు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆత్మకూరు ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రాజు

ఆత్మకూరు: ఏసీబీ వలలో అవినీతి చేప పడింది. విద్యుత్‌శాఖ ఆత్మకూరు రూరల్ ఏఈ వేణుగోపాలరాజు సోమవారం ఓ రైతు నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి పోయాడు. ఏసీబీ డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపిన వివరాలు.. పాములపాడు మండలం బానుముక్కల గ్రామానికి చెందిన రైతు బాలీశ్వరయ్య తన పొలంలో ట్రాన్స్‌ఫార్మం, పోల్ ఏర్పాటు చేయాలని ఆత్మకూరు రూరల్ ఏఈ వేణుగోపాలరాజును సంప్రదించగా రూ.70 వేలు డిమాండ్ చేశాడు. రూ.10 వేల చొప్పున రెండు విడతలుగా రూ.20 వేలు ఇచ్చాడు. మిగతా రూ.50 వేలు ఇస్తేనే పనులు ప్రారంభిస్తానని పట్టుబట్టడంతో రైతు విసుగు చెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రూ.50 వేలను మధ్యవర్తి జంబులయ్య అలియాస్ లాజర్ ద్వారా ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో గీతాభవన్ వద్ద ఏఈ వేణుగోపాల్‌రాజుకు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ కృష్ణయ్య తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నున్న రూ.50 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ శివనారాయణ చెప్పారు.

న్యూస్‌రీల్

ఏపీజీబీ సేవలను సద్విని యోగం చేసుకోవాలి



భవనాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు చైర్మన్

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను ఖాతాదారులు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. పట్టణంలోని ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ సమీపంలో ఏపీజీబీ మెయిన్‌బ్రాంచ్ నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాకేష్ కశ్యప్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో నంద్యాల మెయిన్ బ్రాంచ్ బిజినెస్ రూ.167 కోట్లకు విస్తరించిందన్నారు. ఖాతాదారుల సౌలభ్యం కోసం నంద్యాల మెయిన్ బ్రాంచ్‌ను అన్ని వసతులతో కూడిన నూతన భవనంలోకి మార్చామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ప్రాంతీయ కార్యాలయ రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, చీఫ్ మేనేజర్ తౌర్యనాయక్, సీనియర్ మేనేజర్లు పట్నాయక్, వంశీకృష్ణ, నంద్యాల మెయిన్‌బ్రాంచ్ మేనేజర్ రాజేష్‌వినోద్ పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 188 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 6 పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ పరీక్షలకు 882 మంది విద్యార్థులకు గానూ 798 మంది హాజరయ్యారు. 84 మంది గైర్హాజరయ్యారు. 8 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1,430 మంది విద్యార్థులకు గానూ 1,326 విద్యార్థులు హాజరు కాగా 104 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 14 పరీక్షా కేంద్రాలను, డీఈఓ 2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు సజావుగా జరిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని డీఈఓ అనురాధ తెలిపారు.

గరుడవాహనంపై లక్ష్మీరంగనాథుడు



దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్ల మూలవిగ్రహాలు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం స్వామివారు గరుడవాహనంపై విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. స్వామివారిని పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి ప్రభోత్సవ వాహనం వద్దకు తెచ్చారు. ప్రభోత్సవవాహనంపై స్వామివారిని ఆశీనులను చేసి గోవింద నామాన్ని స్మరిస్తూ జయ జయ ధ్వానాల మధ్య గ్రామపురవీధుల్లో తిప్పారు.

ఈనెల చివరి వరకు ఎస్ఆర్‌బీసీ నీరు

బనగానపల్లె: ఎస్ఆర్‌బీసీ ఆయకట్టు పరిధిలోని 1.62 లక్షల ఎకరాలకు ఈనెల చివరి వరకు సాగునీటిని అందిస్తామని గోరుకల్లు రిజర్వాయర్ ఈఈ సుబకుమార్ తెలిపారు. బనగానపల్లె, కోవెలకుంట్ల అవుకు, సంజామల, పాణ్యం, నంద్యాల మండలాల్లోని ఆయకట్టు పరిధిలో రైతులు రబీలో వరి మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలు సాగు చేశారన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో సుమారు 6 టీఎంసీల నీరు ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

హిందూధర్మ పరిరక్షణే ధ్యేయం

- జాతీయ కార్యదర్శి దేవేంద్రపాండె



వేదికపై వివిధ రాష్ట్రాల పీఠాధిపతులు, స్వామీజీలు, మహాసభ కార్యనిర్వాహకులు



హాజరైన హిందువులు

శ్రీశైలం: హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయమని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి దేవేంద్రపాండె అన్నారు. సోమవారం స్థానిక గురుసదన్‌లో ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన ప్రసంగిస్తూ హిందువుల ఐక్యత కోసం, హిందూ రాష్ట్రంగా, హిందూ దేశంగా వెలుగొందాలని దేశ వ్యాప్త సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు తిరుపతి, తెలంగాణలోని యాదగిరి గుట్టలో నిర్వహించామన్నారు. శ్రీశైలం తర్వాత భద్రాచలంలో లక్ష మంది సాధుసంత్‌తో మహాసభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర హిందూ మహాసభల అధ్యక్షులు రామాయణం మహేష్‌స్వామి మాట్లాడుతూ హిందూ ఆలయాల జీర్ణోద్ధరణకు పిలుపునిస్తూ హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. సనాతన హిందూ ధర్మాన్ని ప్రతి హిందువు పాటించాలన్నారు. తెలంగాణ అధ్యక్షుడు ఆత్మారామ్ సురేష్‌శర్మ, హిందూ మహాసభ జాతీయవర్కింగ్ చైర్మన్ కమలేష్‌దాస్ మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రాలన్నీ హిందూ రాష్ట్రాలుగా మారేంతవరకు ఈ మహాసభల సంకల్పం కొనసాగుతూనే ఉంటుందన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఛత్రపతి శివాజీకి ఖడ్గ ప్రదానం చేశారని, ఇదే రోజు (ఏప్రిల్3) న శివాజీ మహరాజ్ అస్తమించారని, ఆయన అడుగు జాడల్లోనే హిందూ మహాసభ నడుస్తూ హిందూ సామ్రాజ్యస్థాపనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 8 వందల మందికి పైగా సాధు, సంత్‌లు, పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు, హిందువులు హాజరయ్యారు. మహాసభ రాష్ట్ర కార్యదర్శి గూండ్ల మల్లికార్జున, మహాసభ ఆశయాల్లో భాగంగా గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాలకు భజన మండళ్లను ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు ఆయా గ్రామాల్లో నగర సంకీర్తనలు చేసే విధంగా చూడాలని భజన మండళ్ల వారికి సూచించారు.

స్పందన వినతులపై నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల: స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులపై నిర్లక్ష్యం వీడి, గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటీనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 145 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ప్రజలు ఇక్కడికి వస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

స్పందన వినతుల్లో కొన్ని..

- సర్వే నంబర్ 99లో 4.5 ఎకరాల తన భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని గడివేముల మండల కేంద్రానికి చెందిన వి.జంబులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.
- సర్వే నెంబర్ 932/2 లో 95 సెంట్ల తన భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుబుక్కు మంజూరు చేయాలని దొర్నిపాడు గ్రామానికి చెందిన గాజులనాగమ్మ కోరారు.
- పగిడ్యాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బి.ఎల్లప్ప సర్వేనెంబర్ 374/7 లో 2.56 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని వినతి పత్రం అందించారు.
- కోవెలకుంట్లకు చెందిన జడల వెంకటన్న తాను ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉన్నానని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేయిస్తే వ్యాపారం చేసుకుంటానని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

'పది' పరీక్షలు ప్రారంభం



దొర్నిపాడులో విద్యార్థికి వైద్యం చేస్తున్న వైద్యాధికారి

నంద్యాల(సిటీ): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కావడంతో విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నోటీస్ బోర్డుల వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుని గదులకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల రాకతో కేంద్రాల వద్ద రద్దీ వాతావరణం నెలకొంది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యా శాఖ చర్యలు తీసుకుంది. దూర ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులతో రవాణా సౌకర్యం కల్పించారు.

286 మంది గైర్హాజరు..

జిల్లా వ్యాప్తంగా 125 కేంద్రాల్లో 22,979 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 286 మంది గైర్హాజరయ్యారు. నంద్యాల పట్టణంలోని 8 కేంద్రాలను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలు తనిఖీ చేశారు. 5 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు 28 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేసినట్లు డీఈఓ అనురాధ తెలిపారు.

విద్యార్థికి అస్వస్థత

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో విద్యార్థి సురేంద్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఇన్విజిలేటర్ చీఫ్ రాజుకు వైద్య బృందంతో ప్రాథమిక వైద్యం చేయించి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి నంద్యాలకు తరలించారు.

పంటలకూ ఒక ఆరోగ్య కేంద్రం

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 28 ఆర్బీకేల గుర్తింపు
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్బీకే ఇన్‌చార్జులు
- వీరికి అనుబంధంగా పనిచేయనున్న తోటబడి, పొలంబడి ట్రైనర్లు
- వీరందరికీ మూడు విడతల్లో శిక్షణ
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలకు పీహెచ్‌డీసీల ద్వారా పరిష్కారాలు

మనుషుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. అలాగే పశువుల రోగాలను నయం చేసేందుకు వెటర్నరీ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారు. వీటి తరహాలోనే పంటలను కాపేందుకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లు (పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



పీహెచ్‌డీసీగా ఎంపిక చేసిన ఆర్బీకే

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది



ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే మండలాల వారీగా ఆర్బీకేలను, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేశాం. పంటలకు సోకే ఎటువంటి సమస్యలనైనా పీహెచ్‌డీసీల ద్వారా రైతులు పరిష్కరించుకోవచ్చు. ఇప్పటి వరకు అవగాహన లేక అడ్డుగోలుగా కెమికల్స్ వాడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది. దీనిని నివారించేందుకు ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.
- పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి ఏటా 10.50 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, లక్ష హెక్టార్లలో ఉద్యాన పంటలు, 2000 హెక్టార్లలో మల్బరీ సాగవుతోంది. చీడపీడలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. పంటలకు సోకిన సమస్య ఏదో తెలియక రైతులు రకరకాల పురుగుమందులు వాడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అడ్డుగోలుగా పురుగు మందులు పిచికారీ చేయడంతో సమస్యలు మరింత పెరుగుతున్నాయి. పండించిన పంటలు విషతుల్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పెంచడం, చీడపీడలను సకాలంలో గుర్తించి, వాటి నివారణకు పరిష్కారాలను సూచించడం లక్ష్యంగా ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.

వచ్చే ఖరీఫ్ నాటికి అందుబాటులోకి

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే (2023–24) ఖరీఫ్ నాటికి రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతుభరోసా కేంద్రాన్ని పీహెచ్‌డీసీగా గుర్తించాల్సి ఉంది. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ/ హార్టికల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ అర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ/ హార్టికల్చర్ బీఎస్సీ చేసిన ఆర్బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేస్తారు. వీరు లేకపోతే అగ్రికల్చర్/ హార్టికల్చర్‌లో డిప్లొమా చేసిన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటికే కర్నూలు జిల్లాలో 25 మండలాలు, నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో పీహెచ్‌డీసీ ఏర్పాటుకు అవసరమైన ఆర్బీకేలను గుర్తించడంతో పాటు పీహెచ్‌డీసీ డాక్టర్లను కూడా ఎంపిక చేయడం పూర్తి చేశారు.

మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు

ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ల డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. పొలంబడి ట్రైనర్స్‌లో జిల్లా వనరుల కేంద్రానికి చెందిన ఇద్దరు ఏవోలు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉద్యాన అధికారులను ఎంపిక చేయడం కూడా పూర్తి అయింది. పీహెచ్‌డీసీ డాక్టర్లు, పొలంబడి, తోటబడి ట్రైనర్స్‌కు మూడు విడతలుగా 18 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. నంద్యాలలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు వీరికి శిక్షణ ఇస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, మల్బరీ తోటలకు సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకే పురుగులు, వాటిని నివారించుకునేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. సూక్ష్మపోషకాల లోపాలు, వాటి లక్షణాలు, వాటిని నివారించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను 18 రోజుల శిక్షణలో వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ మండలంలోని పీహెచ్‌డీసీలో నిర్ధారిస్తారు. సమస్యను అదుపు చేసుకుందుకు పరిష్కారాలను కూడా సూచిస్తారు.

ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేశారు

● స్పందనలో బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు


స్పందనలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కర్నూలు : ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను కొందరు వ్యక్తులు హ్యాక్ చేసి ఇతరులకు మెసేజ్‌లు, వీడియోలు పంపించి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూలు ధర్మపేటకు చెందిన శ్రీకాంత్ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి స్వయంగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 107 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి.

ఫిర్యాదుల్లో కొన్ని...

● ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేసి ఇబ్బంది పెడుతున్న వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్ ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

● తల్లిదండ్రులకు చేసిన సేవలకు గాను తనకు ఇచ్చిన మూడు సెంట్ల స్థలాన్ని సోదరులు ఆక్రమించుకునేందుకు దౌర్జన్యం చేస్తున్నారని కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన భాగ్యమ్మ ఫిర్యాదు చేశారు.

● తన అమ్మతో తండ్రి గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఆయన ఆచూకీ కనిపెట్టి అప్పగించాలని వెల్దుర్తికి చెందిన కీర్తి ఎస్పీని వేడుకున్నారు.

● హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో పరిచయమై నెల లోపు తనకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా తన ఖాతాకు డబ్బు వేయించుకుని మోసం చేశాడని ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామానికి చెందిన మనోజ్ ఫిర్యాదు చేశారు.

● తన పేరుతో ఉన్న స్థలాన్ని భయపెట్టి రిజిస్టర్ చేయించుకుని కొందరు మోసం చేశారని కర్నూలు వడ్డెగేరికి చెందిన పద్మావతమ్మ ఎస్పీకి విన్నవించారు.


ఓర్వకల్లులో పరీక్షకు హాజరైన విద్యార్థులు



పది పరీక్ష.. మొదలైందిలా

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 9 గంటల లోపే చేరుకున్నారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యా శాఖ అన్ని చర్యలు చేపట్టింది. గతంలో 11 పరీక్షలు ఉండగా, ఈసారి 6 పరీక్షలకు కుదించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

– సాక్షి బృందం


ఏ.క్యాంప్ మాంటిస్సోరి స్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు


ఉయ్యాలవాడ పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థినుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న చీఫ్ సూపర్‌వైజర్


సమయం మించిపోతున్నందున పరుగు తీస్తున్న విద్యార్థి


నందికొట్కూరు గవర్నమెంట్ హైస్కూల్‌లో మంచినీటి సదుపాయం ఏర్పాటు దృశ్యం


నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి


వెల్దుర్తి పరీక్ష కేంద్రం తనిఖీలో కర్నూలు డీఎస్పీ వెంకట్రామయ్య


పగిడ్యాలలో అస్వస్థతకు గురైన విద్యార్థిని రేణుకకు వైద్యం అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది


మహానంది మండలం గాజులపల్లె పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న దృశ్యం

బెల్లం, నవసాగరం స్వాధీనం

వెల్దుర్తి: సెబ్ అధికారులు సోమవారం వెల్దుర్తి మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆటోలో రూ.2లక్షల విలువజేసే బెల్లం (5,580 కేజీలు), నాటుసారా తయారీకి ఉపయోగించే 60 కేజీల నవసాగరం తరలిస్తుండగా రత్నపల్లె జగనన్న కాలనీ వద్ద అదుపులోకి తీసుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి నిందితులు బోయనపల్లెకు చెందిన పులమాడ వెంకటేశ్వర్లు, ఎర్రగుడి నడిపి అయ్యన్నను అరెస్ట్ చేసి డోన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం,1వ అంతస్తు, శంకర్ షాపింగ్ కాంప్లెక్స్, కృష్ణ నగర్ మెయిన్‌రోడ్డు, కర్నూలు- 518002, ఫోన్ : 08518-235800, ఈమెయిల్ : rokni-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వము, పర్యావరణము, వాతావరణ మార్పు మరియు అడవుల మంత్రిత్వ శాఖ, ప్రకటన నెం.ఎస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్‌కు అనుగుణంగా,ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు శ్రీ బి.నాగిరెడ్డి వారు- నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, తమ్మరాజుపల్లి గ్రామం సర్వేనెం.308/భాగం నందు 3.402 హెక్టార్ల విస్తీర్ణంలో 35,910 m3/Annum సామర్థ్యం గల రోడ్డుమెటల్ మైనును స్థాపించుటకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన జారీ చేయబడినది. సదరు ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు క్రింద తెలుపబడినవి.

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	శ్రీ బి.నాగిరెడ్డి (3.402 హెక్టార్లలో రోడ్డు మెటల్ మైను), సర్వేనెం.308/ భాగం, తమ్మరాజుపల్లి గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ ఫోన్: 9440005604
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	సర్వేనెం.308/ భాగం, తమ్మరాజుపల్లి గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు 3.402 హెక్టార్లు విస్తీర్ణం
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ బి.నాగార్జునరెడ్డి, అధీకృత వ్యక్తి, శ్రీ బి.నాగిరెడ్డి (3.402 హెక్టార్లలో రోడ్డుమెటల్ మైను) సర్వేనెం.308/భాగం, తమ్మరాజుపల్లి గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ సెల్:9440005604 ఈమెయిల్: kammari411@gmail.com
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.66 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల సామర్థ్యం	రోడ్డుమెటల్ మైనింగ్-35,910 m3/Annum చేయుటకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 06.05.2023 శనివారం, సమయం: ఉ.11.గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను లీజు ఏరియా వద్ద అనగా సర్వేనెం.308/ భాగం తమ్మరాజుపల్లి గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ క్లస్టర్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచడమైనది.
ఎ) జిల్లా రెవిన్యూ అధికారి మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, నంద్యాల జిల్లా
బి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, ఏపిపిసిబి జోనల్ ఆఫీస్, కర్నూలు
సి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, నంద్యాల, నంద్యాల జిల్లా
డి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లా పరిషత్, కర్నూలు
ఇ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, తమ్మరాజుపల్లి గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా
ఎఫ్) తహశీల్దారు వారి కార్యాలయం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా
జి) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010

ఈ ప్రాజెక్టు వలన నష్టపోవు ప్రజల నుండి మరియు పర్యావరణ సంబంధిత అంశములు వల్ల ప్రభావితపు ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏవైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, కర్నూలు వారికి తెలుపవచ్చును. అట్టివారు పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/-
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము,కర్నూలు

ప్రదేశం : కర్నూలు,
తేది : 04.04.2023

నిందితుల అరెస్ట్

బొమ్మలసత్రం: తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని నమ్మించి నగదుతో ఉడాయించిన 11 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వైఎస్సార్ కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన దస్తగిరిరెడ్డి బంగారం వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. కడపకు చెందిన రాజశేఖర్, సాగర్, రవిచంద్ర, వెంకటేశ్, వీరాంజనేయులు, నగేష్‌లతో పాటు మరో ఐదుగురు కలిసి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని దస్తగిరిరెడ్డికి నమ్మబలికారు. గత నెల 30న కారులో నంద్యాల శివారులోని పీవీ నగరుకు తీసుకొచ్చి దాడి చేసి దస్తగిరి వద్ద ఉన్న రూ.9 లక్షలనూ దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న తాలూకా పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి వారి రూ.8 లక్షల నగదు, కారు, 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కార్మికుడి బలవన్మరణం

ఆలూరు రూరల్: ఒడిశాకు చెందిన కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రంలోని ముస్పల్లి మండలం అమ్మపాడు గ్రామానికి చెందిన చెందిన కార్మికుడు నరహరి మజాహి (46) హాలహర్వి మండలంలోని శిరిగాపురం- కొక్కరచేడు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం వివాహమైన ఇతనికి ఆరు నెలల క్రితం భార్య విడాకులు ఇవ్వడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం పని ప్రదేశంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఆలూ రు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు హాలహర్వి ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు

కర్నూలు: పేద, సామాన్య ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసే మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ కట్టడి కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పేకాట, మట్కా, బెట్టింగ్‌లపై 99 కేసులు నమోదు చేసి 160 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పేకాట నిర్వాహకుల నుంచి రూ.18 లక్షలు, మట్కా నిర్వాహకుల నుంచి రూ.22 లక్షలు, క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల నుంచి రూ.3 లక్షలు నగదుతో పాటు 12 మొబైళ్లు, 779 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

డ్రైవర్ దొంగలా మారి!

● 63 తులాల బంగారం, రూ.14 లక్షల నగదు రికవరీ
● అంతకు ముందు రోజు ట్రాక్టర్ చోరీ
● 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు


నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: కుమార్తె వివాహానికి దాచుకున్న 63 తులాల బంగారు ఆభరణాలు, రూ.14 లక్షల నగదు ఆయన ఇంట్లో పనిచేసే డ్రైవర్, మరో ఇద్దరు డ్రైవర్‌లతో కలిసి దోచుకెళ్లిన ఘటన అవుకు మండలం రామాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈనెల 2న దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే కేసు ఛేదించి బాధితునికి 100 శాతం సొమ్ము అప్పగించడం విశేషం. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. రామాపురం గ్రామానికి చెందిన మల్లు వెంకటేశ్వరరెడ్డి అవుకు మండల కేంద్రంలో శ్లాబ్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. కుమార్తె వివాహం కోసం 40 తులాల బంగారు బిస్కెట్లు, 13 తులాల ఆభరణాలు, రూ.14 లక్షల నగదును ముందుగానే ఇంట్లో తెచ్చి బీరువాలో దాచుకున్నాడు. ఇదంతా తన కారు డ్రైవర్ ఓబులాపురం గ్రామానికి చెందిన మేకల సూర్యచంద్రుడు గమనించాడు. ఎలాగైన కొట్టేయాలని పథకం వేశాడు. వెంకటేశ్వరరెడ్డి ఈనెల 10న తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లాలని డ్రైవర్ సూర్యచంద్రుడుతో చెప్పాడు. డ్రైవర్ ఇదే సరైన సమయమని భావించి 1వ తేదీ ఉదయం తన సెల్ ఫోన్ స్విచ్ఆఫ్ చేసుకోవటంతో వెంకటేశ్వరరెడ్డి మరో డ్రైవర్‌ను తన కారులో తీసుకెళ్లాడు. తరువాత మరుసటి రోజు వేకువజామున సూర్యచంద్రుడు తన స్నేహితులైన అవుకు మండల కేంద్రానికి చెందిన పోతుల రామాంజనేయులు, లంకెల వన్నప్పలతో కలిసి దొంగతనానికి వెళ్లాడు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు బద్దలు కొట్టి బంగారం, నగదు దోచుకుని పరారయ్యారు. ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంకటేశ్వరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. హుటాహుటిన తిరుమల నుంచి గ్రామానికి వెళ్లి చూసి అవుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి డ్రైవర్ సూర్యచంద్రుడిని అదుపులోకి విచారించారు. నిందితుల వద్ద ఉన్న బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అంతకు ముందు రోజు అవుకు గ్రామంలో రూ.6 లక్షల విలువ చేసే ఒక ట్రాక్టర్‌ను కూడా దొంగిలించినట్లు అంగీకరించాడు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. దొంగతనం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని సొమ్ము రికవరి చేసిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ జగదీశ్వరరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

జర్నలిజంలో డిప్లమా కోర్సు

● ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): జర్నలిజం డిప్లమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో 6 నెలల వ్యవధితో ఆన్‌లైన్ డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సహకారంతో పరీక్షలు నిర్వహించి 'డిప్లొమా సర్టిఫికెట్' అందజేస్తామన్నారు. మార్చి 31న నోటిఫికేషన్ విడుదలైందని.. http:// prerracademy. ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను 'సెక్రటరీ, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 40-6/4- 8, 4వ అంతస్తు, మొహల్రాజపురం, విజయవాడకు దరఖాస్తులను ఏప్రిల్ 15వ తేదీ నాటికి పంపాలన్నారు. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్, జర్నలిజంపై ఆసక్తి కలిగిన వారికి డిగ్రీ విద్యార్హతగా నిర్ణయించామన్నారు.

ఈనెల 14 నుంచి యువగళం

కర్నూలు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర 14 జిల్లాలోని బనగానపల్లెలోకి ప్రవేశించనుంది. పాదయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, పార్టీ జోనల్-5 ఇన్‌చార్జి అమర్నాథ్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ సోమవారం కర్నూలు చేరుకుని మౌర్యా ఇన్ హోటల్‌లోని పరిణయ హాల్ నందు ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. కర్నూలు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాల అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరువెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం డైరీ విడుదల


డైరీని విడుదల చేస్తున్న జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సేవా సంఘం-2023 డైరీని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, కార్యదర్శి జవహర్‌లాల్ విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉద్యోగులకు ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కాస్త ఆలస్యంగానైన మంచి సమాచారంతో డైరీని విడుదల చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాశ్, ఎంసీ కాశన్న, కోశాధికారి నాగ కిషోర్, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు మునీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం


యువకుడి మృతదేహం

డోన్ టౌన్: మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామ సమీపంలో ఉన్న మైనింగ్ గనిలో సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు.. గనిలో మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం అందడంతో ప్యాపిలి సీఐ శ్రీరాములుతో కలిసి ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని యువకుడి మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వయస్సు 30 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై చిన్న గాయం తప్ప పెద్ద దెబ్బలు ఏమీ లేవని, ప్రమాదమా, ఆత్మ హత్యకు పాల్పడ్డాడా, లేదా హత్యా అనేది దర్యాప్తులో తేలనుందని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతుడు అలిబాషా

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. సి. బెళగల్‌కు చెందిన అలిబాషా (48) తన భార్య మైబూన్, ఐదేళ్ల కుమారుడు ఫరహత్‌తో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్ స్కూటర్‌పై కర్నూలు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఊరి శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ మలుపు వద్ద ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఆటో ఢీకొంది. ఈ ఘటనలో అలిబాషా తలకు తీవ్ర రక్తస్రావం కాగా మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో అలిబాషా ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి భార్య మైబూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు.